manachourasta
# మన చౌరాస్తా
The Complete News way

మన చౌరాస్తా
Telugu News Channel

సంపుటి : 01 | సంచిక : 177 | మంగళవారం | 10.12.2024

# కొలువుదీరిన తల్లి

## సచివాలయంలో అట్టహాసంగా తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ



ఏ ప్రాంతానికైనా ఒక గుర్తింపు.. అస్తిత్వం తల్లి. సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతి రూపం అమ్మ.. ప్రజలు దశాబ్దాల పాటు పోరాటం చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ తల్లిని ప్రతిష్టించుకోవడం ప్రజలందరికీ గర్వకారణమైన సందర్భమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణకు గుండెకాయలాంటి సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. అట్టహాసంగా సాగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో పాటు రాష్ట్ర మంత్రి వర్గంతో పాటు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో పాటు ఇతర ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ జితేందర్, రాష్ట్రానికి చెందిన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

- మన చౌరాస్తా, హైదరాబాద్



General News



# ప్రజావాణి అర్జీలపై ప్రత్యేక దృష్టి

**జనగామ, మన చౌరాస్తా :** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణిలో వారు పాల్గొని ఆర్జీదారుల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు.ఈ సందర్భంగా 65 ఆర్జీలు వచ్చినట్టు వారు పేర్కొన్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. అదే విధంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారం కోసం అన్ని మండలాల సంబంధిత తహసీల్దార్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తగిన చర్యలకు సూచనలు చేశారు. కార్యక్రమంలో జనగామ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఘనపూర్ (స్టేషన్) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హనుమాన్ నాయక్, డీఆర్డీఓ వసంత, డీపీవో స్వరూప, జిల్లా పౌరసరఫరాల అధికారిణి సరస్వతి, డీడబ్ల్యూఓ ఫ్లోరెన్స్, డీఏఓ



రామారావు నాయక్, వివిధ శాఖల సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ బచ్చన్నపేట మండల కార్యదర్శి దండుగుల మురళీ కృష్ణ, కేవీపీఎస్ మండల కార్యదర్శి మనోహర్ అన్నారు. సోమవారం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం రాష్ట్రంలో ఉన్న అనేక పాఠశాలలో అందించడం లేదన్నారు.అన్నంలో సరైన నాణ్యత లేక విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురైతున్న జిల్లా విద్యాశాఖ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. అలాగే మండలంలో ఉన్న అనేక గ్రామాల నుంచి విద్యార్థులు బచ్చన్నపేట మోడల్ స్కూల్ కి వస్తున్నారని వారికి బస్ సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, బస్సు సౌకర్యం ఉన్న గ్రామాలకు సరైన సమయానికి రాకపోవడంతో విద్యార్థులు, ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారని అన్నారు. ఇంటర్ చదివే విద్యార్థులకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలానే గత ఐదు సంవత్సరాల నుండి పెండింగ్లో ఉన్న 8,300 కోట్ల స్కాలర్షిప్ రియంబర్స్మెంట్ ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్



చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ విషయం మీద రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డికి విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి ఉంటే విద్యార్థుల సమస్యల్ని తక్షణమే పరిష్కరించి వారి బంగారు భవిష్యత్తు తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో అఖిల్, సూర్య, ఆనంద్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# మధిరలో సమావేశమైన యూటీఎఫ్ నాయకులు

**ఖమ్మం, మన చౌరాస్తా :** ఖమ్మం జిల్లా మధిర మండల కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం మండల ముఖ్య నాయకుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూటీఎఫ్ జిల్లా నాయకులు పాల్గొని మాట్లాడుతూ.. మధిర మండల యూటీఎఫ్ కార్యాలయ కన్వీనర్ గా వినోద రావుని ఎంపిక చేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో మండల యూటీఎఫ్ నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.







# టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడిగా పి.చంద్రశేఖర్ రావు
- ప్రధాన కార్యదర్శి మడూరి వెంకటేష్

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జనగామ జిల్లా నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని ఏకశిలా పబ్లిక్ స్కూల్‌లో జరిగిన ఈ ఎన్నికకు ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర నాయకులు మానిక్ రెడ్డి, ఎన్నికల అధికారిగా రంజిత్ కుమార్ వ్యవహరించారు. అధ్యక్షుడిగా పి.చంద్రశేఖర్ రావు, ప్రధాన కార్యదర్శి మడూరి వెంకటేష్, ఉపాధ్యక్షులుగా మంగు జయప్రకాష్, ఉపాధ్యక్షులుగా తాళ్ళపెల్లి హేమలత, కోశాధికారి చిక్కుడు శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు కందుల శ్రీనివాస్, ఏలేటి యాదవరెడ్డి, తోట వెంకటేశ్వర్లు, గూడెల్లి కృష్ణ, పత్తి వెంకటాద్రి, జి.నిరంజని, బానోతు వసంత్ నాయక్, మాడిశెట్టి కృష్ణమూర్తి, ఆడిట్ కమిటీ సభ్యులుగా ఆకుల శ్రీనివాసరావు, తాళ్ళపెల్లి నీలకంఠం, కటకం సుధీర్ రెడ్డి, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కమిటీ సభ్యులుగా గూడెల్లి కృష్ణ, ఎండీ సలావుద్దీన్, టి.బాలకిషన్, వివిధ కమిటీ కన్వీనర్లుగా కేవిఎల్. మర్రెడ్డి (అకడమిక్) సి.హెచ్. నాగరాజం (సోషల్ మీడియా), శ్రీనివాస్ (స్టడీ సర్కిల్), శ్రీహరి (కల్చరల్), దేవ్ సింగ్ (స్పోర్ట్స్), లలిత (మహిళా), యాజమాన్యాలు, కన్వీనర్లుగా బాలకృష్ణ (టీజీఎంఎస్), బి.స్లీవరాజు (ఎంజేపీ), సైదబాబు (సోషల్ వెల్ఫేర్), ఎం.చైతన్య (కేజీబీవీ), హరిసింగ్ (ఏహెచ్ఎస్) ఎన్నికయ్యారు.



# 12న అసెంబ్లీ ముట్టడి

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ గొల్లకురుమల సమస్యలు పరిష్కారం కోసం గొర్రెల మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్కు వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా అధ్యక్షులు మోటే దేవేందర్, జిల్లా కార్యదర్శి సాదం రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో గొల్ల కురుమలకు 2 లక్షల నగదు బదిలీ ద్వారా రెండో విడత గొర్రెల పంపిణీ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. కానీ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా ప్రభుత్వం హామీని నెరవేర్చకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. మూడేండ్ల కింద గొర్రెల కోసం 80 వేల మంది లబ్ధిదారులు ఒక్కొక్కరు రూ.43,750ల చొప్పున డీడీలు తీశారని, గొర్రె ఇలివ్వకుండా గత ప్రభుత్వం మోసం చేసినట్టే, నేటి ప్రభుత్వం కూడా డీడీల డబ్బులు రిటర్న్ ఇస్తూ మొండిచేయి చూపుతుందన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనైనా తమ సమస్యలను చర్చించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 12న చేపట్టనున్న అసెంబ్లీ ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కన్నెబోయిన బాలరాజు, జిల్లా ఉపాధ్యక్షులు గుండ వెంకటయ్య, జిల్లా కమీటి సభ్యులు బూమాండ్ల కుమారస్వామి, బోళ్ల రాజ్ కుమార్, గద్ద రాజు, ఆవుల ప్రభాకర్. పంతంగి రమేష్ పాల్గొన్నారు.

Local News



# విద్యార్థులను ప్రోత్సహించాలి

- అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్
- ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు



**జనగామ, మన చౌరాస్తా :** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి వారిని ప్రోత్సహించాలని జనగామ అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను (ఇన్ స్పైర్ 2024-25) మున్సిపల్ చైర్ పర్సన్ పోకల జమున, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, ఇన్ స్పైర్ పరిశీలకులు పింటు హతి, పాఠశాల ప్రిన్సిపాల్ జోసెఫ్ మారియా, విద్యా శాఖ అధికారి రమేష్ తో కలిసి ప్రారంభించారు. ఈ సంధర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. తరగతి గదిలోనే భావిభారత శాస్త్రవేత్తలు తయారవుతారని, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలన్నారు. రానున్న రోజుల్లో జనగామ ప్రాంతం శాస్త్రవేత్తల నిలయంగా మారాలని మున్సిపల్ చైర్ పర్సన్ జమున ఆకాంక్షించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పిల్లలను ప్రోత్సహించడం, వారు బాధ్యతాయుతమైన పౌరులుగా మారడంలో సహాయపడటం మన అందరి కర్తవ్యమని, ప్రభుత్వం ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించి, విద్యార్థులకు గుణాత్మక విద్య అందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా మార్చేందుకు ఈ వైజ్ఞానిక ప్రదర్శన ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా విద్యా శాఖ అధికారి రమేష్ తెలిపారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శన వీక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనలో జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు తయారు చేసిన 265 ప్రయోగాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఉపేందర్, డీసీఈబీ కార్యదర్శి చంద్రభాను, ఏసీజీఈ టి. రవి కుమార్, జిల్లా సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు బొమ్మనబోయిన శ్రీనివాస్, తోట రాజు, నరసింహ రావు, స్థానిక మండల విద్యా శాఖ అధికారి వంగాల రాజేందర్, రఘునంధన్ రెడ్డి, కళావతి, పి. రమేష్, ఎం. మల్లికార్జున్, రాజేందర్, శోభన్ బాబులు పాల్గొన్నారు.

## కైలాష్ టెకిడి ఆలయాన్ని దర్శించుకున్న మాజీ ఎంపీపీ

**బోథ్, మన చౌరాస్తా :** కైలాష్ టెకిడి వార్షికోత్సవంలో భాగంగా 5వ రోజు చివరి రోజు సందర్భంగా ఆలయాన్ని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరిపై శివాను గ్రహం ఉండి, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. గత బీఆర్ఎస్ హయాంలో ఆలయ నిర్మాణానికి 50 లక్షలు, రోడ్ నిర్మాణానికి 12 కోట్లు, అలాగే అప్పటి ప్రభుత్వంలో తాత్కాలిక రోడ్లు ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలకు అధికాప్రాధాన్యం ఇచ్చామని గుర్తుచేసుకున్నారు. వీరి వెంట బొడ్డు శ్రీనివాస్, గంగమల్లు, గాజుల సుగుణకర్, కధం చక్రపాణి, గొల్లపెల్లి సందీప్, తుల హరీష్ ఉన్నారు.



## జాతీయ స్థాయి పోటీలకు మల్లంపల్లి విద్యార్థి



**పాలకుర్తి , మన చౌరాస్తా:** జనగామ జిల్లా పాలకుర్తి మండలం మల్లంపల్లి గ్రామంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గుగులోతు శోభన్ టెన్నిస్ వాలీబాల్ క్రీడలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 7, 8 న జనగామలోని ధర్మకంచ జడ్పీహెచ్ఎస్ లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి టెన్నిస్ వాలీబాల్ పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు జిల్లా టెన్నిస్ వాలీబాల్ సెక్రెటరీ తేజవత్ మోహన్ తెలిపారు. ఈ నెల 31 నుంచి జనవరి 1, 2 వరకు జాతీయ స్థాయిలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం వారణాసిలో జరిగే క్రీడల్లో పాల్గొంటారని ఆయన తెలియజేశారు. హైస్కూల్ ఉపాధ్యాయులు, మండల, గ్రామ పెద్దలు విద్యార్థిని అభినందించారు.



## బోథ్ ప్రెస్ క్లబ్ కార్యవర్గానికి సన్మానం

**బోథ్, మన చౌరాస్తా :** బోథ్ మండల పాత్రికేయ సంఘం నూతన కార్యవర్గానికి సోమవారం మాల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ముందుగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సుది నరేష్, ప్రధాన కార్యదర్శి గొడిసెల రమణ గౌడ్ తాజా మాజీ అధ్యక్షులు బోనగిరి కార్తీక్ ను ఘనంగా సత్కారించారు. ఈ సందర్భంగా మాల మండల అధ్యక్షుడు ఎలుక రాజు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధి పాత్రికేయులని పేర్కొన్నారు. ప్రజలను పౌరులను మొదటగా మేలుకొలిపేది పాత్రికేయలేనన్నారు. ముఖ్యంగా నేటి సంఘం ఉన్నత విద్యావంతులుగా ఉండటం గర్వించదగ్గ విషయమని తెలియజేశారు. అలాగే మీ పదునైన కలంతో మరింతగా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లలా రాయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు సాయిని గంగాధర్, పురుషోత్తం, షేక్ అలీ, సూర్యం, రమేష్, మాల సంఘం నాయకులైన, బోడ లక్ష్మణ్, మునీశ్వర్ సోమన్న, బత్తుల ఉషన్న, బెంబెరి రమణయ్య, అబూధ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



## పుట్టినరోజు వేడుకల్లో నేతలు

**బచ్చన్నపేట, మన చౌరాస్తా:** జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు నూకల స్వాగత్ రెడ్డి పుత్రిక ధృవిక రెడ్డి జన్మదిన వేడుకలు చేర్యాలలోని షణ్ముఖ గార్డెన్ లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి బచ్చన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల బాల్ రెడ్డి, చేర్యాల మండల అధ్యక్షుడు కొమ్ము రవి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్ కృష్ణన్, బచ్చన్నపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎద్దు హరీష్, నిమ్మ కరుణాకర్ రెడ్డి, అఖిల్ మాల, రంగు అశోక్, అభి వర్మ, ఉదయ్ రాళ్ళబండి తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్‌కు స్థలాన్ని కేటాయించండి



**బోథ్, మన చౌరాస్తా :** బోథ్ మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కోరుతూ సోమవారం జర్నలిస్టులు తహశీల్దార్ సుభాష్ చందర్ కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సూది నరేష్ మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన బోథ్ లో ప్రెస్ క్లబ్ కు భవనం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన తహశీల్దార్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.





# ఘనంగా సోనియా జన్మదిన వేడుకలు

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ ప్రజల కల సాకారం చేసిన రాష్ట్ర ప్రధాత సోనియా గాంధీ జన్మదిన వేడుకలు జనగామ డీసీసీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా నాయకులు, కార్యకర్తలు, అన్ని అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాలు,యూత్ కాంగ్రెస్, పట్టణ వార్డు అధ్యక్షులు, మండల నాయకులు, గ్రామస్థాయి నాయకులు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చినందుకు సోనియాగాంధీ రుణపడి ఉంటామని తెలియజేస్తూ ఆమె చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం కేక్ కటింగ్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, డాక్టర్ రాజమౌళి డాక్టర్ లక్ష్మీనారాయణ నాయక్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ గంగం నరసింహారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గణిపాక మహేందర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికే ఇందిరా, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జాఫర్ షరీఫ్, జనగామ పట్టణ అధ్యక్షులు చెంచారపు బుచ్చిరెడ్డి, జనగామ మండల అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి, జనగామ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వంగాల కళ్యాణి, పట్టణ అధ్యక్షురాలు జక్కుల అనిత, మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గాదపాక రామచంద్రం, బోట్ల శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ వంగాల మల్లారెడ్డి, బడికే కిష్టస్వామి తదితరులు పాల్గొన్నారు.



## పాలకుర్తిలో...

**పాలకుర్తి :** ఏఐసీసీ సభ్యురాలు, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ జన్మదిన వేడుకలను సోమవారం పాలకుర్తి నియోజకవర్గంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. ప్రత్యేక కేక్ కట్ చేసి బ్లాక్ అధ్యక్షుడు సత్యనారాయణ, మండల అధ్యక్షుడు కుమారస్వామి నాయకులకు పంచిపెట్టారు. తెలంగాణ ఇచ్చిన తల్లిగా సోనియాను వారు అభివర్ణించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మంజుల, యాకాంతరావు, నాయకులు మహేందర్ , జలగం కుమార్ రమేష్ , పులి గణేష్, అంజీరావు తదితరులు పాల్గొన్నారు.

## చేర్యాలలో...

చేర్యాల : సోనియాగాంధీ జన్మదిన వేడుకలను చేర్యాల పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేర్యాల మండల పార్టీ అధ్యక్షుడు కొమ్ము రవి, పట్టణ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ సోనియా గాంధీ వల్ల నే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో నాయకులు పట్టణ, మండల ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, నామినేటెడ్ డైరెక్టర్లు, మహిళా యూత్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## బచ్చన్నపేటలో...

బచ్చన్నపేట : అరవై ఏళ్ల కల ఆకాంక్ష సాకరం చేసిన తెలంగాణ తల్లి సోనియమ్మ జన్మదినాన్ని బచ్చన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్ నాయకులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**చేర్యాల, మన చౌరాస్తా :** మండలంలోని చుంచనకోట గ్రామంలోని హైస్కూల్‌లో 2007-2008లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు అదే పాఠశాలలో 16 సంవత్సరాల తర్వాత ఆపూర్వ విద్యార్థుల ఆత్మీయత సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. తొలుత వారితో కలిసి చదువుకుని మృతి చెందిన విద్యార్థుల ఆత్మలకు శాంతి కలగాలని వారికీ నివాళి అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను వేదికపైకి ఆహ్వానించి, పాదాభివందనం చేసి పూలమాలు, శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులు లక్ష్మి, విజయకుమార్, వెంకటేశం, రామచంద్రారెడ్డి,కాంతి కృష్ణ, శ్రీనివాస్ బాబు, వెంకట్రామిరెడ్డి లు మాట్లాడుతూ.. చదువుకునేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు తమ వంతు సహకారం



అందించాలని పూర్వ విద్యార్థులకు సూచించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని, ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ ఆత్మీయత సమ్మేళనంలో చిన్ననాటి మిత్రులు చాలా సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడంతో అప్పటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుని ఎంతో ఆనందంలో మునిగిపోయారు. చిన్ననాటి కబుర్లు చెప్పుకుంటూ వారి క్షేమసంగతులు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు బూడిద చందు, జగదీష్,బాలకిషన్, మంద మహిపాల్ రెడ్డి, ఉజ్వల,నాగలక్ష్మి, రజిత,రమాదేవి, తదితర విద్యార్థులు ఉన్నారు.

## నర్సంపేటలో పంబా ఆరట్టు మహోత్సవం

**నర్సంపేట, మన చౌరాస్తా :** శ్రీ ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి సేవా చారిటబుల్ ట్రస్ట్ నర్సంపేట వారి ఆధ్వర్యంలో సోమవారం ఆలయంలో నిర్వహించిన పంబా ఆరట్టు మహోత్సవ కార్యక్రమానికి దాత గా పెద్ది సుదర్శన్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మాదన్నపేట చెరువు వద్ద జలక్రీడలకు ఉత్సవ విగ్రహాన్నిఊరేగింపు గా తరలించారు. సుమారు పదివేల మంది కి మహా అన్నదానం ఏర్పాటు చేశారు.

Health special

# తులసి ఆకులు తింటే ఈ రోగాలన్నీ మాయం..



**తులసి ఆకుల్లో** ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. తులసి ఆరోగ్యకరమైన రక్త ప్రవాహాన్ని నిర్వహించడానికి, కొలెస్ట్రాల్ సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. రోజూ ఉదయాన్నే. మన ప్రకృతిలో ఉన్న అనేక మొక్కలు, వృక్షాలలో ఎన్నో ఔషధ గుణాలు నిండివున్నాయి. అందులో అతి ముఖ్యమైనది అత్యంత పవిత్రమైనది తులసి మొక్క. మన పూర్వీకుల కాలం నుంచి తులసిని అత్యంత పవిత్రమైనదిగా కొలుస్తూ వస్తున్నారు. పురాణాలలో కూడా తులసి మొక్కను విష్ణుమూర్తికి అత్యంత ప్రీతిపాత్రమైనదిగా భావిస్తారు. ఇలాంటి తులసిని నేడు ఔషధాల తయారీలో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. తులసిలోని ఔషధ గుణాలు ఆరోగ్యంతోపాటు సౌందర్య పోషణలో కూడా మేలు చేస్తాయి. తులసిలోని కొమ్మలు, ఆకులు, విత్తనాలు, కాడలు, వేర్లు, వేర్ల దగ్గరి మట్టి కూడా ఔషధ గుణాలను కలిగి ఉంటాయని ఆయుర్వేద వైద్య నిపుణులు చెబుతున్నారు. అలాంటి తులసిలోని మరిన్ని లాభాలేంటో ఇక్కడ తెలుసుకుందాం. ఆయుర్వేదం ప్రకారం తులసి అనేక ఔషధ గుణాలు కలిగిన మొక్క. ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి, చర్మ వ్యాధులను నివారించడానికి తులసిని ఉపయోగిస్తారు. తులసిలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఇన్ఫెక్షన్లతో పోరాడుతాయి. తులసిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ దెబ్బతినకుండా శరీరాన్ని రక్షిస్తాయి. ముఖ్యంగా ఈ చలికాలంలో తులసి ఆకులను తేనెలో ముంచి ఉదయం ఖాళీ కడుపుతో తీసుకుంటే జలుబు, తుమ్ములు, దగ్గు, గొంతునొప్పి మొదలైన వాటి నుండి ఉపశమనం పొందవచ్చు. తులసిలో శరీరంలో మంటను తగ్గించే సమ్మేళనాలు ఉన్నాయి. తులసి ఆకులతో టీ తయారు చేసుకుని తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరిగి శరీర, మానసిక ఒత్తిడి తగ్గుతుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో తులసి ఆకులను నమలడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఖాళీ కడుపుతో తులసి నీటిని తాగడం వల్ల బరువు తగ్గుతారని నిపుణులు చెబుతున్నారు. ఇది జీర్ణక్రియను కూడా సులభతరం చేస్తుంది. తులసిలో ఉండే యూజీనాల్ అనే సమ్మేళనం టైప్ 2 డయాబెటిస్‌ను నియంత్రించడంలో సహాయపడుతుంది. తులసి ఆకుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. తులసి ఆరోగ్యకరమైన రక్త ప్రవాహాన్ని నిర్వహించడానికి, కొలెస్ట్రాల్ సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. రోజూ ఉదయాన్నే తులసి టీ తాగడం వల్ల చెడు కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది. ఇది గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది



# మాగిన అరటిపండ్లలో పోషకాలు..!


సాధారణంగా పండిన అరటి పండ్లతో పోలిస్తే బాగా పండిన అరటి పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. కణ నష్టాన్ని నిరోధిస్తుంది. అంతర్గత డ్యామేజీలు, ఫ్రీ రాడికల్స్ వలన కలిగే కణాల నష్టాన్ని తగ్గించడానికి బాగా పండిన అరటి పండు ఉపయోగపడుతుంది. అరటి పండ్లు అల్సర్స్ సమస్యతో బాధపడుతున్న వారికి, అత్యంత లాభదాయకమైన పండుగా ఉంటుంది. అల్సర్ సమస్యతో ఉన్న వ్యక్తి నిస్సంకోచంగా ఈ పండిన అరటి పండును తినొచ్చంటున్నారు. అలాగే, పండిన అరటి పండ్లలో పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. మరియు సోడియం నిక్షేపాలు తక్కువగా ఉంటాయి. ఇది మీ కొలెస్ట్రాల్ స్థాయిలను నిర్వహించడంలో మేలుచేస్తుంది. ఒక మోస్తరుగా పండిన అరటి పండ్ల కన్నా బాగా పండిన అరటి పండ్లలోనే పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో హైబీపీ తగ్గుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. బాగా పండిన అరటి పండ్లను తింటే శక్తి బాగా లభిస్తుంది. దీంతో అలసిపోకుండా పనిచేయవచ్చు. వీటిలో ఐరన్ కూడా అధికంగా ఉంటుంది. ఇది అనీమియా సమస్యను నివారిస్తుంది. రక్త స్థాయిలను సహజ సిద్ధంగా పెంచడానికి సహాయపడుతుంది.

# పసుపు నీళ్లు తాగితే ఇన్ని ప్రయోజనాలా?



**మన దేశంలో** పసుపు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. ఆధ్యాత్మికం, సంప్రదాయం, ఆరోగ్య పరంగా పసుపు అత్యంత కీలకమైన సుగంధ ద్రవ్యంగా చెబుతారు. అందుకే ఎన్నో ఏళ్లుగా పసుపును ఓ సంప్రదాయ మెడిసిన్ గా మన దేశంలో ఉపయోగించబడుతుంది. పసుపులో ఉండే అనేక ఔషధ గుణాలు ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలను అందిస్తాయి. అందుకే పసుపుతో చేసిన వంటకాలు తినడం వల్ల కూడా మెరుగైన ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అయితే పరగడపున పసుపు నీళ్లు తాగడం ద్వారా కూడా అనేక లాభాలు పొందవచ్చు. అవేంటో తెలుసుకుందాం. పరగడపున పసుపు నీళ్లు తాగడం వలన శరీర బరువును నియంత్రించుకోవచ్చు. పసుపులో ఉండే యాంటీఆక్సిడెంట్ గుణాలు శరీర బరువు పెరగకుండా కాపాడతాయి. పసుపులో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని ఫ్రీ రాడికల్స్ డ్యామేజ్ నుంచి కాపాడుతాయి. ప్రతిరోజూ పసుపు నీటిని తీసుకుంటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతూ ఇన్ఫెక్షన్లతో పోరాడటంలో సహాయపడుతుంది.పసుపు నీటిని క్రమం తప్పకుండా తాగడం వల్ల జీర్ణ ఆరోగ్యం మెరుగుపడుతుంది. గ్యాస్ సమస్య తగ్గుతుంది. పసుపు జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ప్రతిరోజూ ఖాళీ కడుపుతో పసుపు నీటిని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. డయాబెటిక్ బాధితులకు మంచిది. పసుపులో కర్కుమిన్ అనే శక్తివంతమైన యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలతో కూడిన పదార్థం ఉంటుంది. పసుపు నీటిని క్రమం తప్పకుండా తాగడం వల్ల మీ శరీరంలో మంట తగ్గుతుంది. దీర్ఘకాలిక వ్యాధులను నివారించడంలో ఇది మీకు సాయపడుతుంది. కర్క్యుమిన్‌కు క్యాన్సర్‌ను నిరోధించే సామర్థ్యం ఉందని ప్రయోగశాలల్లో నిర్వహించిన అనేక అధ్యయనాల్లో తేలింది. పసుపు నీటిని క్రమం తప్పకుండా తీసుకుంటే గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుందని నిపుణులు చెబుతున్నారు. పసుపు నీళ్లు తాగడం ద్వారా కొలెస్ట్రాల్ శాతం తగ్గి శరీరంలో రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. గుండె ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. అల్జీమర్స్ వ్యాధి బారినపడకుండా మనల్ని మనం కాపాడుకునేందుకు పరగడపున పసుపు నీళ్లు తాగడం అలవాటు చేసుకోవాలి. అంతేకాదు.. పసుపు నీళ్లు తాగడం వల్ల రక్తాన్ని శుద్ధి చేసుకోవచ్చు. తద్వారా శరీరంలో విషపదార్థాలను తొలగించి చర్మాన్ని కాంతివంతంగా మారుస్తుంది. పసుపు నీళ్లను తాగడం ద్వారా శరీరంలో గాల్‌బ్లాడర్ ద్వారా బైల్ ఉత్పత్తి పెరుగుతుంది. పసుపు నీళ్లలోని యాంటీ క్యాన్సర్ గుణాలు శరీరంలో క్యాన్సర్ కణాల పెరుగుదలను అడ్డుకుంటాయి.

# ఏది తింటే బరువు తగ్గుతారు?



**చాలా మందికి** బరువు తగ్గాలని ఉంటుంది..అయితే త్వరగా వెయిట్ లాస్ అవ్వడానికి రోటి తింటే మంచిదా లేక అన్నం తింటే మంచిదా..ఈ డౌట్ మీకు ఉందా.. అయితే అన్నం లేదా రోటి ఏది తింటే బరువు తగ్గుతారంటే? బరువు తగ్గాలంటే కార్బోహైడ్రేట్ల తక్కువ ప్రోటీన్‌ను ఎక్కువ తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తూ ఉంటారు. అయితే మన భారతదేశంలో ప్రతి భోజనంలో బియ్యం లేదా రోటీలు ఉండాల్సిందే.. కానీ అందులో కార్బోహైడ్రేట్లు అధికంగా ఉంటాయి. అయితే బరువు తగ్గేదెలా అని అనుకుంటున్నారా? బరువు తగ్గాలంటే కార్బోహైడ్రేట్ల తక్కువ ప్రోటీన్‌ను ఎక్కువ తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తూ ఉంటారు. అయితే మన భారతదేశంలో ప్రతి భోజనంలో బియ్యం లేదా రోటీలు ఉండాల్సిందే.. కానీ అందులో కార్బోహైడ్రేట్లు అధికంగా ఉంటాయి. అయితే బరువు తగ్గేదెలా అని అనుకుంటున్నారా? బరువు తగ్గాలని అనుకునేవారు రాత్రి పూట తేలికపాటి భోజనం తీసుకోవాలి. అయితే వారికి ఒక్క డౌట్ ఉంటుంది. అన్నం రోటీలో ఏది తీసుకుంటే బెటర్ అని..వరిలో అతితక్కువ సోడియం కంటెంట్ ఉంటుంది. అలాగే 120 గ్రాముల గోధుమలలో 190 %ఎస్త్ర% సోడియం ఉంటుంది. 60 గ్రాముల బియ్యంలో 80 కేలరీలు, 1 గ్రా ప్రోటీన్, 0.1 గ్రాముల కొవ్వు, 18 గ్రాముల కార్బోహైడ్రేట్లు ఉంటాయి. రోటీని గోధుమల నుండి తయారు చేస్తారు కాబట్టి బియ్యంతో పోలిస్తే ఇందులో ఎక్కువ పోషకాలు ఉంటాయి. అంతేకాకుండా, బియ్యం గోధుమలు రెండూ ఒకే పరిమాణంలో ఫోలేట్ , ఐరన్ కలిగి ఉంటాయి.అన్నం, రోటీ రెండూ వాటి స్వంత ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటాయి. బియ్యం పప్పు కలిసి అందులో అన్ని అమైనో ఆమ్లాలు ఉంటాయి. జొన్న, బార్లీ, వేలు లేదా ముత్యాల మిల్లెట్ తో చేసిన రోటీ వల్ల కాల్షియం, ఫాస్పరస్, జింక్ వంటి పోషకాలు మీకు అందుతాయి. రెండూ మంచి ఎంపికలే కావడంతో.. ఒక్కరోజు అన్నం మరోరోజు రోటి తింటే బాగుంటుంది. అయితే బరువు తగ్గాలనుకునే వారు మాత్రం వారు తీసుకునే పోర్షన్ సైజ్‌ల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. రాత్రి 8 గంటలలోపు డిన్నర్ చేసేలా చూసుకోవాలి.

# మన చౌరాస్తా

10.12.2024 మంగళవారం




## థ్రిల్ చేసే

# కిల్లర్

**మన చౌరాస్తా, సినిమా :** ‘శుక్ర’, ‘మాటరాని మౌనమిది’, ‘ఏ మాస్టర్ పీస్’ వంటి డిఫరెంట్ సినిమాలతో సినీ ప్రేమికుల దృష్టిని ఆకట్టుకుంటున్న దర్శకుడు పూర్వాజ్. ఆయన తాజాగా ‘కిల్లర్’ (పార్ట్ 1 డ్రీమ్  గర్ల్ ) అనే యాక్షన్ థ్రిల్లర్‌ని రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన ఒక హీరోగా నటిస్తుండటం విశేషం. ఏయు అండ్ఐ, మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థతో కలిసి థింక్ సినిమా  బ్యానర్ పై ఈ చిత్రాన్ని పూర్వాజ్ ప్రజరు కామత్, ఎ.పద్మనాభరెడ్డి నిర్మిస్తున్నారు. ఈ కలయికలో నిర్మాణమవుతున్న రెండవ చిత్ర మిది. ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్‌ను హైదరాబాద్, వికారాబాద్ పరిసర ప్రాంతాల్లో పూర్తి చేశారు. 10 రోజుల పాటు జరిగిన ఈ షెడ్యూల్‌లో హీరో పూర్వాజ్, హీరోయిన్ జ్యోతి పూర్వాజ్‌తో పాటు ప్రధాన తారాగణం పాల్గొన్నారు.  ప్రస్తుతం రెండో షెడ్యూల్ చిత్రీకరణ ప్రారంభిస్తున్నారు. ఈ షెడ్యూల్‌లో మరో హీరో విశాల్ రాజ్ పాల్గొంటారు. రామోజీ ఫిలిం సిటీ, మొయినాబాద్ లొకేషన్స్‌లో జరిగే ఈ రెండో  షెడ్యూల్‌లో గౌతమ్ అనే యాక్టర్‌తో పాటు జ్యోతి పూర్వజ్ కూడా జాయిన్ కాబోతున్నారు. ఈ షెడ్యూల్‌లో కూడా సినిమాకి సంబంధించి కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు.  భిన్న యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ సినిమా కచ్చితంగా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తుంది. పవర్‌ఫుల్ కాన్సెప్ట్‌తో దర్శకుడు పూర్వాజ్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు అని  చిత్ర యూనిట్ తెలిపింది.

# Varsha
## Digitals

మీ పుట్టిన రోజు, పెళ్లిరోజుల శుభాకాంక్షలు.. నూతన సంవత్సర గ్రీటింగ్ కార్డ్స్ మరియు క్యాలెండర్లను ఆకర్శనీయంగా డిజైనింగ్ చేయబడును.. వివరాలకు ఈ కింది నంబర్లను సంప్రదించండి.

**8555 800 812**
**9676 400 812**

